


***(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)***

**90**

**(30' ఆగస్ట్ 72, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

వాగ్దానాలకు అంతేమిటీరోజుల్లో. ప్రచారాల్లో వాగ్దానాలు ప్రణయాల్లో వాగ్దానాలు. పౌరుషం కోసం వాగ్దానాలు. హోదాకోసం వాగ్దానాలు. చాకిరి చేయించుకోవడం కోసం వాగ్దానాలు. టోకరా కొట్టడం కోసం వాగ్దానాలు ఎన్ని విధాలో ఎన్ని తమాషాలో.

ముఖ్యంగా ఎన్నికల సమయంలో చేసే వాగ్దానాలకు అంతు వుండదు చెయ్యగలరో లేదో ఊహించుకోవడానికి కూడా ఒకప్పుడు వ్యవధి వుండదు. అలా వాగ్దానాల తోరణాలు అల్లుకుంటూ పోవలసిందే వీటిలో చాలావరకు వెంటనే వాడిపోతాయి. కొన్నికట్లు వూడి గాలికి కొట్టుకుపోతాయి. ఏ కొద్ది మాత్రమో అలా నిలబడివుంటాయి. క్రొత్త చివుళ్ళు వేయకపోయినా కోరికలు తీరకపోయినా.

***ఆంధ్రమంత్రి అభయదానం***

మంత్రుల వాగ్దానాలకు సంబంధించిన కథలు కబుర్లూ చాలా వచ్చినా యిదివరలో. ఈ మధ్యనే ఒక ఆంధ్రమంత్రి వాగ్దానాలు నిలబెట్టుకుని తీరాలి. వాటిని సాధించి తీరాలి. అసాధ్యమనే మాట వినిపించకూడదు అన్నారు ఎంతో ధీమాతో. వీరివల్ల చాలా వాగ్దానాలు సత్యాలుగా వర్ధిల్లుతాయనే భావం కలిగింది.

దశాబ్దాలుగా అలా నిలిచిపోయిన వాగ్దానాలు కొన్ని వుంటాయి. అక్కడక్కడా "ఎప్పటికైనా నేను శాసన సభ్యుణ్ణయి, ఈ ఊరుకు కావలసిన సౌకర్యాలన్నీ సమకూర్చితీర్తాను" అని వాగ్దానాలు పెద్దలు చాలామంది ఎన్ని సంవత్సరాలుగానో ఆ వాగ్దానాన్ని పునరుద్ఘాటిస్తూ కాలం గడుపుతూనే వున్నారు.

ఒక మంత్రిగారు ఏదో ఊళ్ళో సభలో ఉపన్యసిస్తూ "నేను వాగ్దానం చేసి తప్పుకునేరకం ఎంతమాత్రం కాదు. అన్న మాట నెగ్గించి తీర్తాను. దీనిలో సత్యం మీరే చూద్దురుగాని - ఏదైనా మీరందరూ ఏకగ్రీవంగా కోరండి. వెంటనే చెయ్యకపోతే అప్పుడడగండి" అన్నాడుట.

*మంత్రిగారూ! తమరు పదవి వదలండి*

ఒక సభికుడు చివాలున లేచి "అయ్యా మేం ఏకగ్రీవంగానే అడుగుతున్నాం. ఇందులో చీలికలు లేవు. మా కోరిక తప్పక మన్నిస్తామన్నారు. తమరు శీఘ్రమైనంత త్వరలో మంత్రి పదవికి రాజీనామా ఇవ్వాలనేదే మా కోరిక. మాట తప్పకూడదు మరి" అన్నాడుట.

మంత్రిగారు కొంచెంసేపు పెదవులు మెదిపారుగాని మాట రాలేదు. చివరకు "అదేమి కోరిక ఇప్పుడు రాజీనామా యిస్తే ఎలా పదవిలోకి వచ్చి పదినెలలైనా కాలేదు. రాజీనామా ఇస్తే మీకు నష్టం. కావలసిన పనులు చేయించుకోండి. సంబరాలు పడుతూ చేయించుకోండి" అన్నాడుట.

"ఏం లాభం మాట తప్పారు మీరు" అని సభలో వారు కొందరు కేకలు పెట్టారుట.

ప్రేయసీ ప్రియుల మధ్య కూడా ఉద్రేకం కొద్దీ వాగ్దానాలు జరుగుతూ ఉంటాయి. వాటిని తీర్చడమంటూ వచ్చేసరికి, హృద్రోగాల క్రింద మారుతూ ఉంటాయి. స్రామాట్టులు, సమర్థులూ పూర్వం వాగ్దానాలు చేసేవారు. ఎలాగో అలా నెరవేర్చుకునేవారు. షాజహాన్ తాజ్‌మహల్ కట్టించటం కేవలం ఆవిడ జ్ఞాపకార్థమేనంటారు. కానీ ఈ నిర్మాణానికి వెనుక కూడా ఒక గొప్ప వాగ్దానం ఉందిట.

***ముంతాజ్‌కు ముందుగానే వాగ్దానం***

షాజహాన్‌కు పట్టాభిషేకం జరుగబోతుండగా ముంతాజు తన మేనత్త నూర్జహాన్‌ను చూడటానికి జైలుకి వెళ్ళింది. కేవలం ఆవిడ ఆశీస్సులు పొందాలనేది ఆవిడ అభిమతం. కానీ నూర్జహాన్‌కు అంతులేని కోపం వచ్చిందిట. దీవించడానికి బదులు శపించిందట.

"నన్ను జైల్లో పడేసినంతమాత్రాన నా పేరు మాసిపోదు. దేశంలో ప్రతినాణం మీదా నా బొమ్మ వుంది. ప్రతివారు నాణంతోబాటు నన్నూ కళ్ళకు అద్దుకుంటున్నారు. నువ్వెంత నీ పేరెంత? " అని ధిక్కరించిందిట.

ముంతాజు దుఃఖిస్తూ వచ్చి భర్తకు విషయం తెలియచేసింది. అవతల పట్టాభిషేక సమయం దగ్గిరపడుతోంది. అప్పుడు షాజహాన్ వాగ్దానం చేశాడుట. "నీ పేరు ప్రపంచ వ్యాప్తి చెందేలాగా పాలరాతి భవనం కట్టిస్తాను. నాణాలు మారిపోతాయి. తాజ్‌మహల్ తరతరాలా నిలిచిపోతుంది" అన్నాడుట.

దురదృష్టవశాత్తు - ముంతాజు జీవించి ఉండగా ఆ నిర్మాణం జరగలేదు. అందువల్ల స్మారక చిహ్నంగా నిలిచిపోయింది అని చంద్రశేఖర్‌గారనే ప్రఖ్యాత రచయిత వ్రాశారు. ఇలాగే చరిత్రల్లో, పురాణాల్లో అంతులేని వాగ్దాన గాథలు గోచరిస్తాయి.

***నా సర్వస్వం ధారపోస్తాను దేవీ***

ప్రణయంలో పడ్డవారు వొళ్ళు తెలియకుండా వాగ్దానాలు చేస్తూ ఉంటారు. "నా సర్వస్వం నీకు అర్పిస్తాను దానికి సిద్ధంగా ఉన్నాను, నా ప్రణయదేవతా కోరుకోవడం నీదే తరువాయి, నీరజవదనా! మాట తప్పుతానని ఎంతమాత్రం సందేహపడకు మందగమనా" అలాటి వాక్యాలు జలపాతంలాగా కురిపించడం మామూలు.

ఒక యువక పుంగవుడు ఇలాగే అనేక వాగ్దానాలు చేశాడుట. తనను ఎంతో ఘనంగా ప్రేమిస్తున్నదనుకున్న వనితారత్నంతో.

ఆవిడ ఈ ద్విపద విని విని ఎంతో విసుగెత్తిపోయిందిట. చివరకు ఒకనాడు "నాకోసం మీరు చేయదలచిన త్యాగానికి ఎంతో కృతజ్ఞురాలిని. మీ సర్వస్వం దోచుకునేంత ద్రోహిని కాదు నేను. నన్ను ఒక సంవత్సరం పోషించండి మహాశయా! ఆ తర్వాత నేనే ఉద్యోగం చేసి మిమ్మల్ని పోషిస్తాను. పువ్వుల్లో పెట్టి పూజిస్తాను కూడా" అన్నదట.

***ఒక్కసారే చెక్కు వ్రాసి పంపిస్తా ప్రేయసీ***

"ఒక్క సంవత్సరం పోషించాలా! సంవత్సరమేనా, మొత్తం ఎంత అవుతుంది. ఎంత అయినా ఫర్వాలేదనుకోండి. అంత మొత్తం ఎంత అవుతుంది. ఎంత అయినా ఫర్వాలేదనుకోండి. అంత మొత్తం ఒక్కసారే తెచ్చి బ్యాంకులో వేద్దామని మీరు తిప్పలు పడకుండా తీరిగ్గా చదువుకోవచ్చని" అన్నాడుట.

ఆవిడ కొంచెం ఆలోచించి "బాగా ఖర్చు చేస్తే, అంటే మీ ప్రేయసిలాగా కనిపించాలంటే అంటే సీతాకోకచిలకలాగా సింగారించుకుని, మీ గుండెల్లో సంతోషం రంగరించాలంటే నాలుగువేలు అవుతుంది. ఈ సంవత్సరమంతా నాకు మల్లేనేనే వుండి అంటే అజ్ఞాతవాసం గడపాలంటే రెండున్నరవేలవుతుంది" అన్నదట.

ఆ ప్రణయమూర్తి బీదహృదయంలో ఫైర్ యింజన్ గంటలు మ్రోగాయుట. కానీ పైగా ఎంతో తేలికగా భావించినట్లు నటిస్తూ "అలాగే మరేం ఫర్వాలేదు. నాలుగువేలకే చెక్కు పంపుతాను సీతాకోక చిలకలాగానే ఎగురు. మరేం ఫర్వాలేదు. నీకోసం ఆ మాత్రం ఖర్చు పెట్టడమొక లెక్కా! రేపు కనిపిస్తా" నని తెచ్చుకున్న నవ్వుతో వచ్చిన దారి చేత్తో పుచ్చుకున్నాడుట.

***నా టీ కాటిప్పణం వేరు సుందరీ!***

కొన్నాళ్ళు పోయిన తర్వాత తను తిరిగి ప్రేయసి దర్శనానికి రాకుండా "నేను సర్వస్వం అర్పిస్తానన్నమాట నిజమే. కానీ ఆ సర్వస్వానికి నేను భావించిన అర్థం వేరు. ప్రణయంలో సర్వస్వం అంటే - సుఖం, సంతోషం, హృదయం, సేవాస్తోత్రం ఇత్యాదులని అర్థంగాని సిరి అని కాదు. నువ్వు పొరపాటుగా అర్థం చేసుకున్నావు.

ప్రణయానికి సంబంధించిన టీ కాటిప్పణం సరిగా తెలియని నిన్ను ప్రేమించడం నాదే పొరపాటు. ఒకనాడు శుభమస్తు అని ప్రారంభించిన మన ప్రణయానికి ఈ ఉత్తరంతో స్వస్తి.

షరా: సొమ్ముమీద వ్యామోహంపోయి, అచ్చమైన, స్వచ్ఛమైన ప్రేమ నీలో తొంగిచూస్తే, అప్పుడు కొంచెం కబురు పంపించు" అని వ్రాశాడుట. ఇలా చెలామణి కాని వాగ్దానాలెన్ని ఉంటాయో ప్రణయంలో.

చాలాకాలం క్రిందట - కర్జు అనే ఒక సైనికాధికారి తన ప్రేయసితో అన్నాడుట "నువ్వు నాకు కల్పించిన స్వప్నమయ జీవితం మరే స్త్రీ కల్పించలేదు కనుక ఒకరోజు నీకోసం నా ప్రాణం అర్పిస్తాను" అని.

అన్నట్లుగానే ఒకరోజు రివాల్వర్ తీసుకుని తన తలమీద ప్రేల్చుకుని ప్రేయసి దగ్గర మరణించాడుట. ఇలాటి వాగ్దానాలు కూడా ఉంటాయి కొన్ని.

Post your comments